గ్రామమా.. మురుగుకూపమా!

- ముడిగేడులో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- వీధుల్లో నిలిచిపోతున్న మురుగునీరు
- చెత్తచెదారంతో నిండిన కాలువలు
- దుర్గంధంతో ప్రజల ఇక్కట్లు


ముదిగేడులో ఇంటి ముందున్న మురుగును చూపుతున్న మహిళలు


ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగునీరు

సంజామల: గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కాలనీలు, రోడ్లు ఇలా ఎక్కడ చూసినా మురుగునీరే దర్శనమిస్తోంది. నాయకులు, అధికారులు స్వచ్ఛ ఆంధ్రా అంటూ ఆర్భాటాలకు పరిమితమవుతున్నారే తప్ప సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి ఉదాహరణ సంజామల మండలం ముదిగేడు గ్రామం. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. గ్రామం మొత్తం మురుగునీటి కూపంలా మారింది. గ్రామ సచివాలయం నుంచి బస్టాండ్ ప్రధాన రహదారి వరకు మురుగునీరు ప్రవహిస్తోంది. కాలనీల్లో రోడ్డుమీదే మురుగు ప్రవహిస్తుండగా, ఎస్సీ కాలనీలో నిల్వనీరు దుర్వాసనతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. దాదాపు 2 వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో చిన్న వానకే రోడ్లపై రోజులు తరబడి నీరు నిల్వ అవుతుండడంతో, వ్యాధులు వ్యాపిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్తతో నిండిన కాల్వలు

కాల్వల్లో పూడికలు తీయకపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. నాగులకట్ట వీధి పరిసరాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. కాలనీల్లో చెత్త, మురుగునీరు ఇళ్ల ముందు నిల్వ ఉండడంతో జీవనమే కష్టంగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ''మీరే డ్రైనేజీ నిర్మించుకోండి'' అన్న సమాధానం వస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.


వాటర్ ట్యాంక్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

స్వచ్ఛ ఆంధ్రా.. ప్రచారానికే!

ప్రతి నెలా మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివాస్' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, వాస్తవానికి మాత్రం ఏ శుభ్రతా పనులు జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో, శుభ్రత కార్యక్రమాలు కేవలం ఫొటోలకు మాత్రమే పరిమితమైపోతున్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామనే హెచ్చరికలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని, ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని గ్రామాన్ని మురుగుకూపం నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


బస్టాండ్ వద్ద..

గ్రామంలోని చెత్తంతా మా ఇంటి ముందే



గ్రామంలోని ప్రధాన రహదారిలో ఉన్న మురుగు నీరంతా మా ఇంటి ముందే నిల్వ ఉంటోంది. ఒక్కసారి కూడా శుభ్రం చేసిన దాఖలాలు లేవు. మురుగు మొత్తం రోజుల తరబడి అలానే ఉండడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. తలుపులు మూసుకుని ఉన్నా కంపు భరించలేకున్నాం. మా సమస్యను అర్థం చేసుకుని డ్రైనేజీ కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయండి.

– సుబ్బులక్ష్మమ్మ, ముదిగేడు, సంజామల

రోగాల బారిన పడుతున్నాం



గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు. ఎక్కడ చూసినా మురుగునీరు, చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. దోమలు విజృంభిస్తున్నాయి. డ్రైనేజీతో సహజీవనం చేస్తున్నాం. రోగాల బారిన పడుతున్నాం. అధికారులు పట్టించుకోవడంలేదు. ఒక్కసారి మా బాధను వినండి. మా ఆరోగ్య పరిస్థితి మీ చేతుల్లో ఉంది. డ్రైనేజీ వ్యవస్థను బాగుచేసి మాకు విముక్తి కల్పించండి.

–పక్కీరమ్మ., ముదిగేడు గ్రామం, సంజామల

సమస్యలు పట్టించుకోవడం లేదు



ప్రధాన రహదారిపై మా ఇల్లు ఉంది. ఇంటి ముందు నిత్యం మురుగు నీరు ఉంటోంది. ఏదైనా పెద్ద వాహనం వెళ్తే మురుగు నీరు మా ఇంట్లో పడుతున్నాయి. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా సమస్యను పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్నాం. స్వచ్ఛ ఆంధ్రా అంటూ అధికారులు ఆర్భాటం చేస్తున్నారే తప్ప గ్రామాల వైపు చూడడం లేదు.

–అల్లి, ముదిగేడు, సంజామల మండలం

క్లుప్తంగా

ఉమామహేశ్వరుని సేవలో కాటసాని


స్వామివారిని దర్శించుకుంటున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వరస్వామిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో ఏకశిలా రూపంలో ఉన్న శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

28న లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల కొండపై వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 28న కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి సాయి గురువారం తెలిపారు. మైన్స్ అండ్ జియాలజీ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సామూహిక కల్యాణం జరిపించనున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం కల్యాణం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారని తెలిపారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

బేతంచెర్ల: పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మండల ప్రత్యేక అధికారి బషీరున్నీసా బేగం,ఈఓఆర్డీ మల్లికార్జున అన్నారు. గురువారం మండల పరిధిలోని సిమెంట్‌నగర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అలాగే ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు డాక్టర్ అబ్దుల్ అలీమ్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

తడిచెత్త సేకరణపై సీఆర్పీలకు శిక్షణ


మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి కళ్యాణి

కోవెలకుంట్ల: పట్టణంలోని ఎస్‌డబ్ల్యూపీసీలో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కు గురువారం తడిచెత్త సేకరణపై శిక్షణ ఇచ్చారు. కోవెలకుంట్ల, బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మండలాల్లో పనిచేసే సీఆర్పీలకు మండల ప్రత్యేక అధికారి కళ్యాణి ఆధ్వర్యంలో జిల్లా రిసోర్స్‌పర్సన్ యశ్వంత్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువుగా తయారు చేసి ఎరువును విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలని సూచించారు. సీఆర్పీలు వారికి కేటాయించిన వెయ్యి ఇళ్లకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఎంపీడీఓ వరప్రసాదరావు, కోవెలకుంట్ల, సంజామల డిప్యూటీ ఎంపీడీఓలు ప్రకాష్‌నాయుడు, రాధిక పాల్గొన్నారు.

దీన్‌దయాల్ ఆశయాలను సాధిద్దాం


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్: ఏకాత్మ మానవతా వాద సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి శరీరం, ఆత్మ జ్ఞానంల సమన్వయమే అభివృద్ధికి కారణం అని భావితరాలకు చాటిచెప్పిన గొప్ప సిద్ధాంత కర్త పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ అని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం డోన్ టౌన్‌లో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను సాధిద్దామని పిలుపునిచ్చారు.

చాపిరేవులలో చోరీ

నంద్యాల(అర్బన్): చాపిరేవుల గ్రామానికి చెందిన దూదేకుల బాలుడు ఇంట్లో ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు రూరల్ పోలీసులు గురువారం తెలిపారు. బాలుడు చిన్న కూతురును ఇంటి వద్ద ఉంచి కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు బాలికను మభ్యపెట్టి ఇంట్లోకి ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలను దొంగిలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

మరిదిపై గొడ్డలితో దాడి

డోన్: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో అన్నదమ్ముల మధ్య నెలకొన్న భూవివాదం చివరకు గొడ్డలితో దాడి చేసేంత వరకు వెళ్లింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల చంద్రుడు, రాంభూపాల్ అన్నదమ్ములు. కొంత కాలంగా పొలం విషయంలో వివాదం నడుస్తోంది. గురువారం తమ్ముడు రాంభూపాల్ బైక్‌పై వెళుతుండగా అన్న భార్య, కుమారుడు గొడ్డలితో దాడికి దిగారు. ఈ దాడిలో తల, వీపు భాగాన తీవ్ర గాయాలయ్యాయి. వారికి చిక్కకుండా ఇంటికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

ఉల్లి రైతులను విస్మరించడం దారుణం


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్: ఉల్లి రైతుకు గిట్టుబాటు ధరలతో పాటు, ఎకరాకు లక్ష చొప్పున నష్టపరిహారం అందించాలని సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు మోట రాముడు, నారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఉల్లి పంటలకు తగిన ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉల్లికి క్వింటా రూ.1200 గిట్టుబాటు ధర కల్పిస్తామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం ఆ ధరతో ఏ విధంగా రైతులకు న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. ఎకరా ఉల్లి సాగుకు రూ.1.20 లక్షలు ఖర్చుపెట్టి సాగు చేస్తే నష్టపరిహారం ఎకరాకు రూ.20 వేలు ఇస్తామని చెప్పడం చంద్రబాబుకు రైతులపై ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతుందన్నారు.

బుగ్గనను విమర్శించే స్థాయి మీకెక్కడిది


మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: డోన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని విమర్శించే అర్హత బేతంచెర్ల టీడీపీ నేతలకు లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, అధికార ప్రతినిధి మురళీకృష్ణ, పార్టీ కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, పిట్టల జాకీర్ మాట్లాడారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో విద్య, వైద్యం,తాగునీరు, సాగునీరు, రహదారులతో పాటు, అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. అర్హులైన రైతులకు సరఫరా కావాల్సిన యూరియాను టీడీపీ నేతలు బ్లాక్‌మార్కెట్‌కు తరలించారని బుగ్గన వాస్తవాలే భయటపెట్టారన్నారు. కొలుములపల్లె పంచాయతీకి వచ్చిన 400 బస్తాల యూరియాను టీడీపీ నేతలు కుమ్మక్కై మాయం చేసినట్టుగా ఆరోపించారు.

టీడీపీ లోపాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం

వార్డు మెంబర్‌గా కూడా పోటీ చేయని మండల టీడీపీ నాయకులు బుగ్గన్ భవిష్యత్తు గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. బీసీ నాయకులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు టీడీపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. టీడీపీ ముసుగులో బీసీలను బలిపశువులుగా మారుస్తున్నారని మండిపడ్డారు. మండల టీడీపీ నాయకుడు భీమేశ్వర్‌రెడ్డి తన ప్రాబల్యాన్ని ఉపయోగించి పోలీస్ స్టేషన్‌ను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. పోలీసులే వాస్తవాలు తెలుసుకొని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 70 ఏళ్లుగా ప్రజలకు సేవ చేస్తున్న బుగ్గన వంశాన్ని విమర్శించే స్థాయి టీడీపీ నేతలకు లేదని షేక్షావలి చౌదరిపై మండిపడ్డారు. ఇలాంటి చవకబారు విమర్శలు చేస్తే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొక తప్పదన్నారు. బనగానపల్లె రైల్వేగేటులో 9 మంది కుటుంబ సభ్యులు కలిసి లేఔట్ ఏర్పాటు చేసుకుని ప్లాట్లు విక్రయిస్తే నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డికి సంబంధం ఉందని చెప్పడం సబబు కాదన్నారు. జగనన్న స్మార్ట్ సిటీ పరిధిలో జరిగిన అక్రమాలపై పచ్చి అబద్ధాలు చెబుతూ రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నిజంగా సమస్య ఉంటే అధికార పార్టీ నేతగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. 40 ఏళ్లుగా జరగని అభివృద్ధిని బుగ్గన చేసినా, టీడీపీ నేతలు కళ్లుండి చూడలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఐటీఐ, ఎంఎస్ఎంఈ, పాలిటెక్నిక్ భవనాలు వంటి అనేక అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ టీడీపీకి సవాల్ విసిరారు. పార్టీ నాయకులు మూర్తుజావలి, బాబుల్ రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎద్దులన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లోకపావని.. జగజ్జనని


నందవరంలో కూష్మాండ అలంకారంలో చౌడేశ్వరిదేవి


ప్యాపిలి: గాయత్రీదేవిగా వాసవీమాత


డోన్: వారాహి దేవిగా కన్యకాపరమేశ్వరి


మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో గాయత్రీదేవిగా మహాలక్ష్మి


అవుకులో సంతానలక్ష్మి


కోవెలకుంట్ల: బాలాత్రిపుర సుందరిగా వాసవీమాత


గరుడ వాహనంపై మద్దిలేటి నరసింహస్వామి


బేతంచెర్ల: దుర్గామాతకు పూజలు చేస్తున్న మహిళలు

డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో దసరా మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. నందవరం చౌడేశ్వరిదేవి కూష్మాండ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే బేతంచెర్లలోని మద్దిలేటి స్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారు గాయత్రీదేవిగా కనువిందు చేశారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్

డిజిటల్ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

కోవెలకుంట్ల: పొదుపు మహిళలు డిజిటల్ లావాదేవీలపై దృష్టి సారించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో కోవెలకుంట్ల బ్లాక్ పరిధిలోని ఏడు మండలాల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీడీ మాట్లాడుతూ.. పొదుపు మహిళలు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, తదితర డిజిటల్ పద్ధతుల్లో లావాదేవీలు నిర్వహించుకోవచ్చన్నారు. పొదుపు మహిళలకు పొదుపు, డిపాజిట్లు వంటి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ పుస్తక నిర్వహణ, అప్పుల వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రతి సభ్యురాలికి 20 అంకెల నంబర్ ఉంటుందన్నారు. ఈ నంబర్ ద్వారా మొబైల్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ పొదుపుకు సంబంధించిన లావాదేవీలను సరిచూసుకోవచ్చన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్, ఇతర రుణాలను తీసుకున్న మహిళలు వందశాతం చెల్లించేలా వెలుగు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆయా మండలాల ఏపీఎంలు చంద్రశేఖర్, బాబు, సీసీలు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించేందుకు కుట్ర


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

కోవెలకుంట్ల: రీవెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లను తొలగించేందుకు కూటమి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు ఆరోపించారు. పింఛన్లను తొలగించవద్దని కోరుతూ గురువారం దివ్యాంగులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 85 శాతం దివ్యాంగత్వం ఉన్న వారికి నెలకు రూ. 15వేలు, మిగిలిన వారికి రూ. 6 వేల చొప్పున ప్రతి నెలా పింఛన్లు అందుతున్నాయన్నారు. ఇటీవల దివ్యాంగుల పింఛన్లపై వెరిఫికేషన్ చేపట్టినా తిరిగి అన్ని రకాల దివ్యాంగుల పింఛన్లపై మళ్లీ రీ వెరిఫికేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. రీ వెరిఫికేషన్‌లో 85 శాతం దివ్యాంగత్వం ఉన్న వారికి శాతం తగ్గించి రూ.15 వేల స్థానంలో రూ. 6 వేలు, మిగిలిన వారికి దివ్యాంగత్వ శాతాన్ని తగ్గించి రూ. 6వేలు కూడా రాకుండా చేయాలనే తలంపుతోనే ఈ అంశాన్ని తెరపైకి తెస్తోందన్నారు. పింఛన్లు తొలగిస్తే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సంఘం నాయకులు జాకీర్, నాగరాజప్ప, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

డోన్ టౌన్: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. గురువారం పట్టణంలోని మాకం వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా వచ్చారు. డోన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27న మెగా రక్తదాన శిబిరం

బనగానపల్లె రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 27న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బీజేపీ ప్రధాన కార్యదర్శి శివకృష్ణయాదవ్ తెలిపారు. అదే రోజు పట్టణంలో బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవం కూడా జరుగుతుందని చెప్పారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

అవుకు(కొలిమిగుండ్ల): చెర్లోపల్లె–అవుకు రిజర్వాయర్ మార్గంలోని మలుపు వద్ద గురువారం ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. బనగానపల్లె మండలం ఇల్లూరి కొత్తపేటకు చెందిన ఫరూక్ తన కుమార్తెను తాడిపత్రిలో వదిలిపెట్టి బైక్‌పై స్వగ్రామానికి బయలు దేరాడు. చెర్లోపల్లె దాటాక మలు పు వద్ద బనగానపల్లె నుంచి తాడిపత్రి వెళుతున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో ఫరూక్ గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానికులు అతన్ని అవుకు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు నంద్యాలకు తరలించారు.

క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడాలి

బేతంచెర్ల: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ఆటల్లో పాల్గొనాలని ఎస్‌ఐ రమేష్‌బాబు, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, చైర్మన్ చలం రెడ్డి పిలుపునిచ్చారు. దసరా పండుగను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బేతంచెర్ల హంటర్స్ టీమ్ ఆధ్వర్యంలో మండల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సరదాగా క్రికెట్ ఆడి యువకులకు ఉత్సాహ పరిచారు. ఈ పోటీల్లో మొత్తం 30 జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.20 వేల నగదు బహుమతిని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి సహకారంతో అందజేస్తారు. ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు శంకర్‌నాయక్, లక్ష్మణ్ సహకారంతో ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాజశేఖర్ అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త గూని నాగరాజు, నిర్వాహకులు రాజేష్, రవి, శ్రీనివాస్, అబ్దుల్, సురేష్, అమ్జాద్, మోహన్, సన్నీ పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ, ఎంపీపీ, కమిషనర్, చైర్మన్

క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కోవెలకుంట్ల: క్యాన్సర్ వ్యాధిపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు మహబూబ్ సుభాని, దివ్య అన్నారు. గురువారం మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్‌నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్త్రీలు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌పై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. పౌష్టికాహారం తీసుకుని రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు దరి చేరకుండా వ్యాయామం, యోగా వంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలని వివరించారు. సీహెచ్‌ఓ లక్ష్మీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, స్టాఫ్‌నర్స్ మరియమ్మ, ఫార్మసీ ఆఫీసర్ విజయకుమారి పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం


మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యశాల మెడికల్ ఆఫీసర్ వాణి

బనగానపల్లె రూరల్: ఆయుర్వేద మందులతో దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ లలిత అధ్యక్షతన వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆయుర్వేదంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వాణి మాట్లాడుతూ.. ప్రశాంతమైన మనసు, సహజ వాతావరణం ఆయుష్షును పెంచుతాయని, చరక సంహిత నుంచి నేటి వరకు ప్రజలు ఆయుర్వేద పద్ధతులను అనుసరిస్తున్నారని తెలిపారు. పోషక విలువలతో కూడిన ఆహారం, సానుకూల దృక్పథం కూడా ఆయుర్వేద జీవనశైలిలో భాగమని సూచించారు. వృక్షశాస్త్ర అధ్యాపకురాలు వసుంధర కరోనా సమయంలో ప్రజలు వాడిన వనమూలికల ప్రాధాన్యతను వివరించారు.కార్యక్రమంలో అధ్యాపకులు బడేసాహెబ్, మహమ్మద్ గౌస్, ఉమామహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సీతమ్మ, కౌసల్యాదేవి, వరలక్ష్మి, రామకృష్ణ, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.